www.prajaprerana.co.in
RNI : APTEL/26/A3850

# ప్రజా ప్రేరణ న్యూస్

prajaprerana.2026@gmail.com

నిజం | నిష్పక్షపాతం | ప్రజా ప్రేరణ




సంపుటి : 01 సంచిక : 37 ప్రకాశం మంగళవారం 07-07 -2026 ప్రకాశం నుంచి ప్రచురణ పబ్లిసర్ :కుందురు శ్రీనివాసరెడ్డి పేజిలు: 4 వెల :

Volume : 01 Issue : 37 PRAKASAM 07-07-2026 Publisher : KUNDURU SRINIVASA REDDY Pages :4 Rs : 2/-

## ఎస్ఐఆర్ కార్యక్రమంపై విస్తృత అవగాహన కల్పించాలి..

బిఎల్ఏలతో సమన్వయ సమావేశంలో అన్నా రాంబాబు...

ప్రతి అర్హుడి వివరాలు నమోదు అయ్యేలా క్షేత్రస్థాయిలో పని చేయాలని సూచన...



**ఏపీ బ్యూరో / జులై 06, ప్రజా ప్రేరణ :**

మార్కాపురం పట్టణంలో కొనసాగుతున్న ప్రత్యేక సవరణ కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని గిద్దలూరు మాజీ శాసనసభ్యుడు, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు గారు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం మార్కాపురం పట్టణ పరిధిలోని 9 వార్డులకు చెందిన 39, 40 బూత్ స్థాయి ఏజెంట్లతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక సవరణ కార్యక్రమం అమలు తీరుపై సమీక్ష నిర్వహించిన అన్నా రాంబాబు, ఓటరు జాబితా ప్రక్రియలో ప్రతి అర్హుడి వివరాలు సక్రమంగా నమోదు కావడం అత్యంత కీలకమని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కుకు ఉన్న ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా బీఎల్ఏలు కృషి చేయాలని సూచించారు. ప్రత్యేక సవరణ కార్యక్రమానికి సంబంధించిన నిబంధనలు, విధివిధానాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. అవసరమైన పత్రాలను నిర్ణీత గడువులోగా సమర్పించేలా ప్రజలను చైతన్యపరచాలని, ఎవరూ ఓటరు జాబితా ప్రక్రియకు దూరం కాకుండా చూడాలని సూచించారు. గ్రామాలు, వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని, కార్యక్రమం ఉద్దేశాన్ని వివరించాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం పెరగాలంటే క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించడం అవసరమని అన్నా రాంబాబు పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఏలు పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే కార్యక్రమం విజయవంతం అవుతుందని తెలిపారు. ప్రజలకు ఎలాంటి సందేహాలు తలెత్తకుండా ప్రతి అంశాన్ని సులభంగా అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. ప్రజల ఓటు హక్కు పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, అర్హులైన ప్రతి వ్యక్తి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన కోరారు. కార్యక్రమం అమలులో ఎదురయ్యే సమస్యలను వెంటనే పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకురావాలని బీఎల్ఏలకు సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి షంషీర్ అలీ బేగ్, మార్కాపురం పట్టణ అధ్యక్షుడు షేక్ సలీం, మాజీ మున్సిపల్ చైర్మన్ బాల మురళీకృష్ణ, వైస్సార్సీపీ 9 వార్డు ఇంచార్జి మొగల్ సిరాజ్ బేగ్, పట్టణ కార్యదర్శి సత్యం రెడ్డి, పట్టణ బూత్ స్థాయి కన్వీనర్ నాలి కొండయ్య యాదవ్, ఉత్తమ్ కుమార్, శేషయ్య, సుభాని, కుర్షిద్, సర్దార్, మునవర్, సాయి, ఆకుల నాగేంద్ర, అన్నపురెడ్డి శంకర్ రెడ్డి, మార్కాపురం వైస్సార్సీపీ టౌన్ సోషల్ మీడియా వైస్ ప్రెసిడెంట్ షేక్ అయూబ్ అలీ, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. 22

## బాధిత కుటుంబాలకు అండగా కె.పి. నాగార్జున రెడ్డి...



**ఏపీ బ్యూరో / జులై 06, ప్రజా ప్రేరణ :**

మార్కాపురం జిల్లా, కంభం మండలంలోని, కందులాపురం సెంటర్ సమీపంలో ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో బాధితులైన కుటుంబాలకు గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జ్ కె.పి. నాగార్జున రెడ్డి ఆర్థిక సాయం అందించారు. ఈ ప్రమాదంలో గిద్దలూరు పట్టణంలోని నల్లబండ బజారుకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందగా, మరో ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ప్రమాద బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన కె.పి. నాగార్జున రెడ్డి, వారి పరిస్థితిని తెలుసుకుని వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 60 వేల నగదు సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కష్టకాలంలో పార్టీ అండగా ఉంటుందని, అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు కట్టుబడి ఉంటామని తెలిపారు. కంభం సమీపంలో జరిగిన ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని పేర్కొన్నారు. కుటుంబాన్ని కోల్పోయిన వారి బాధ వర్ణనాతీతమని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక..

బాబూ జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం,, వైఎస్ జగన్...





**ఏపీ బ్యూరో / జులై 06, ప్రజా ప్రేరణ :**

అణగారిన వర్గాల ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, సమాన అవకాశాల సాధన కోసం జీవితాంతం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ అని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పిస్తూ సామాజిక మాధ్యమ వేదికలో సందేశం విడుదల చేశారు. దేశ రాజకీయ చరిత్రలో డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ ఒక విశిష్ట వ్యక్తిత్వమని, అణగారిన వర్గాలకు ఆత్మవిశ్వాసాన్ని కల్పించి సమాన హక్కుల కోసం నిరంతరం పోరాడిన నాయకుడిగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని వైఎస్ జగన్ తెలిపారు. సామాజిక సమానత్వం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి దేశానికి మార్గదర్శకంగా నిలిచిందన్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధి, రక్షణ రంగం బలోపేతం, దేశ ఆర్థిక ప్రగతిలో డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. వివిధ కీలక బాధ్యతల్లో పనిచేసిన సమయంలో ఆయన చూపిన నాయకత్వం, దూరదృష్టి దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాయని గుర్తు చేశారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు ప్రతి పౌరుడికి అందాలని ఆకాంక్షిస్తూ జీవితాంతం ప్రజాసేవకు అంకితమైన డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని వైఎస్ జగన్ పేర్కొన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు.

## మత్స్యకారుల గల్లంతు ఘటనపై వైఎస్సార్‌సీపీ ఆందోళన..







యుద్ధప్రాతిపదికన శోధన చర్యలు చేపట్టాలని డిమాండ్...

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు...

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మంచా నాగమల్లేశ్వరి...

**ఏపీ బ్యూరో / జులై 06, ప్రజా ప్రేరణ :**

విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లి సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు డిమాండ్ చేశారు. ప్రమాదం జరిగి 24 గంటలకు పైగా గడిచినా ప్రభుత్వం తగిన స్థాయిలో స్పందించకపోవడం అత్యంత విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బాధిత కుటుంబాలకు పార్టీ అన్ని విధాలా అండగా నిలుస్తోందని స్పష్టం చేశారు. సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబ సభ్యులను ఆదివారం విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లోని మత్స్యశాఖ కార్యాలయం వద్ద కేకే రాజు పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యుల పరిస్థితిని తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సమన్వయ కర్తలు తిప్పల శ్రీనివాస్, దేవన్ రెడ్డి, మొల్లి అప్పారావు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ, ప్రమాదవ శాత్తు బోటు మునిగిపోవడంతో ఆరుగురు మత్స్యకారులు గల్లంతవడం అత్యంత దురదృష్టకరమన్నారు. సమీపంలో లంగరు వేసి ఉన్న వాణిజ్య నౌకను ఆశ్రయించి కర్రీ చిన్నా అనే మత్స్యకారుడు ప్రాణాలతో బయటపడటం ఒక్కటే కొంత ఊరటనిచ్చే అంశమని పేర్కొన్నారు. అయితే, నిన్న మధ్యాహ్నం జరిగిన ప్రమాదంపై ప్రభుత్వం వెంటనే స్పందించి ఉండి ఉంటే పరిస్థితి మరింత మెరుగ్గా ఉండేదన్నారు. గత మూడు రోజులుగా బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రమాదం జరిగిన వెంటనే నౌకాదళం, కోస్ట్ గార్డు, ఇతర ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి విస్తృత స్థాయిలో గాలింపు చర్యలు చేపట్టి ఉంటే గల్లంతైన మత్స్యకారులను గుర్తించే అవకాశాలు ఎక్కువగా ఉండేవని అభిప్రాయ పడ్డారు. గల్లంతైన మత్స్యకారులందరూ విజయనగరం జిల్లా ముక్కాం గ్రామానికి చెందిన ఒకే కుటుంబ సభ్యులు కావడం మరింత విషాదకరమన్నారు. ఆ కుటుంబాలపై ఆధారపడి జీవిస్తున్న చిన్నారులు, మహిళలు, వృద్ధుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందన్నారు. మత్స్యకారుల జీవితం పూర్తిగా సముద్రంపై ఆధారపడి ఉంటుందని, వారి కష్టసుఖాలన్నీ సముద్రంతోనే ముడిపడి ఉంటాయని పేర్కొన్నారు. బాధిత కుటుంబాల వేదనను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని కోరిన కేకే రాజు, రాష్ట్ర మంత్రి, స్థానిక ప్రజాప్రతినిధులు సంఘటన స్థలానికి వచ్చినప్పటికీ బాధిత కుటుంబాలను నేరుగా పరామర్శించకుండా అధికారులతో సమీక్షలు నిర్వహించి వెళ్లిపోవడం బాధాకరమని విమర్శించారు. బాధిత కుటుంబాలకు మానసిక ధైర్యం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఉపగ్రహ వ్యవస్థలు, ప్రత్యేక గాలిం పు పరికరాలను వినియోగించి గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం నిరంతర శోధన చర్యలు కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గల్లంతైన మత్స్యకారులు క్షేమంగా తిరిగి రావాలని ప్రార్థిస్తున్నామని తెలిపారు. అలాగే, సముద్రంలో ప్రాణాలకు తెగించి చేపల వేట సాగించే మత్స్యకారులకు సరైన భద్రతా చర్యలు, బీమా సదుపాయాలు, సబ్సిడీలు, ప్రభుత్వ భరోసా అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. బోట్లకు, మత్స్యకారులకు బీమా ప్రీమియం చెల్లించే స్థోమత లేకపోవడంతో ప్రభుత్వం ప్రత్యేక పథకాలు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సముద్ర వాతావరణ హెచ్చరికలు, భద్రతా ప్రమాణాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై మత్స్యకారులకు సమగ్ర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గతంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన మత్స్యకార సంక్షేమ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.


## రోడ్లపై చెత్త వేస్తే రూ.1000 వరకు జరిమానా..

వ్యాపారులకు మున్సిపాలిటీ హెచ్చరిక..

**ఏపీ బ్యూరో / జులై 06, ప్రజా ప్రేరణ :**

మార్కాపురం జిల్లా, పొదిలి నగర పంచాయతీ పరిధిలో రోడ్లపై చెత్త వేస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు మున్సిపల్ అధికారులు హెచ్చరించారు. పట్టణ పరిశుభ్రతకు భంగం కలిగించే విధంగా వ్యవహరించే షాపుల యజమానులకు రూ. 1000 వరకు జరిమానా విధించనున్నట్లు వెల్లడించారు. పొదిలి పట్టణంలోని పాతూరు ప్రాంతంలో ఆదివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు ఈ విషయాన్ని వ్యాపారులకు వివరించారు. షాపుల నుంచి వెలువడే చెత్తను తప్పనిసరిగా చెత్తబుట్టల్లోనే వేయాలని, రోడ్లపై లేదా బహిరంగ ప్రదేశాల్లో పడేయరాదని సూచించారు. ఏ షాపు ముందు చెత్త పేరుకుపోయి కనిపించినా, సంబంధిత షాపు యజమానిపైనే బాధ్యత నిర్ధారించి జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. పట్టణ పరిశుభ్రతను కాపాడేందుకు ప్రతి వ్యాపారి సహకరించాలని కోరారు. ప్రజారోగ్య పరిరక్షణ, పారిశుధ్య నిర్వహణలో భాగంగా మున్సిపాలిటీ ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. రోడ్లపై చెత్త వేయడం వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందువల్ల వ్యాపారులు, ప్రజలు పరిశుభ్రత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

## ఆరోగ్య దీపిక,, ఆక్యుపంక్చర్ అంటే ఏమిటి?..



**ఏపీ బ్యూరో / జులై 06,(ప్రజా ప్రేరణ):**

ఆక్యుపంక్చర్ అనేది శరీరంలోని నిర్దిష్ట బిందువులలో చాలా సన్నని సూదులను చొప్పించి నొప్పిని తగ్గించడం, శరీర పనితీరును మెరుగుపరచడం, మరియు కొన్ని ఆరోగ్య సమస్యలకు చికిత్స చేయడానికి ఉపయోగించే ఒక వైద్య విధానం.కొన్ని రకాల నొప్పుల చికిత్సలో ఆక్యుపంక్చర్ సహాయక చికిత్సగా ఉపయోగించబడుతుంది.ఇందులో శరీరంలోని నిర్దిష్ట బిందువులపై చాలా సన్నని సూదులను చొప్పిస్తారు.నొప్పులలో ఆక్యుపంక్చర్ ఉపయోగాలు, మెడ నొప్పి,మెడ కండరాల బిగుతును తగ్గించడంలో సహాయపడుతుంది. కదలికను మెరుగుపరచవచ్చు.నడుము నొప్పి,,దీర్ఘకాలిక నడుము నొప్పిలో కొంతమందికి నొప్పి తగ్గడంలో సహాయపడుతుంది.వ్యాయామం మరియు ఫిజియోథెరపీతో కలిపి ఉపయోగిస్తే మరింత ప్రయోజనం ఉండవచ్చు.మోకాలి నొప్పి,,ముఖ్యంగా ఆస్టియోఆర్థ్రైటిస్ వల్ల వచ్చే నొప్పి, బిగుతు తగ్గడంలో సహాయపడవచ్చు.భుజం నొప్పి,,ఫ్రోజన్ షోల్డర్ లేదా కండరాల బిగుతు వల్ల కలిగే నొప్పిని తగ్గించడంలో ఉపయోగపడవచ్చు.తలనొప్పి మరియు మైగ్రేన్,,కొంతమందిలో తలనొప్పి వచ్చే తరచుదనం మరియు తీవ్రతను తగ్గించడంలో సహాయపడుతుంది.సయాటికా,,నరంపై ఒత్తిడి వల్ల వచ్చే కాలు నొప్పి,తిమ్మిరి వంటి లక్షణాలను తగ్గించడంలో సహాయపడవచ్చు.మోచేయి నొప్పి,,నొప్పి తగ్గించి చేతి పనితీరును మెరుగుపరచడంలో సహాయపడవచ్చు.కండరాల మరియు కీళ్ల నొప్పులు,,కండరాల బిగుతు తగ్గించి నొప్పి నుంచి ఉపశమనం కలిగించవచ్చు.ఆక్యుపంక్చర్ ఎలా పనిచేస్తుంది?,. శరీరంలోని నొప్పి సంకేతాలను ప్రభావితం చేయడంలో సహాయపడుతుంది.సహజమైన నొప్పి నివారణ రసాయనాలు (ఎండోర్ఫిన్లు) విడుదల కావడాన్ని ప్రోత్సహిస్తుందని భావిస్తారు.కండరాల బిగుతును తగ్గించి రక్తప్రసరణను మెరుగుపరచడంలో సహాయ పడవచ్చు.జాగ్రత్తలు,,ఆక్యుపంక్చర్‌ను శిక్షణ పొందిన, అర్హత కలిగిన నిపుణుడి చేత మాత్రమే చేయించుకోవాలి.ఒకసారి మాత్రమే ఉపయోగించే, శుభ్రమైన (స్టెరైల్) సూదులను ఉపయోగించడం చాలా ముఖ్యం.రక్తం పలుచబడే మందులు తీసుకుంటున్నవారు, రక్తస్రావ సమస్యలు ఉన్నవారు లేదా గర్భిణీలు చికిత్స ప్రారంభించే ముందు తమ వైద్యుడికి తెలియజేయాలి.తీవ్రమైన నొప్పి, జ్వరం, గాయం లేదా నరాల బలహీనత వంటి లక్షణాలు ఉంటే ముందుగా వైద్య పరీక్ష అవసరం.ఆక్యుపంక్చర్ కొన్ని రకాల నొప్పులకు ఉపయోగకరంగా ఉండొచ్చు, కానీ ప్రతి వ్యక్తిలో ఫలితాలు ఒకేలా ఉండవు. ఇది అవసరమైతే ఇతర వైద్య చికిత్సలతో కలిసి ఉపయోగించే సహాయక చికిత్సగా పరిగణించబడుతుంది. ఆక్యుపంక్చర్ పాయింట్లు:శరీరంలో, ఆక్యుపంక్చర్‌లో శరీరంపై వందలాది ప్రత్యేక బిందువులు (సాంప్రదాయంగా 300 కంటే ఎక్కువ ప్రధాన పాయింట్లు) ఉపయోగిస్తారు. ఏ పాయింట్లను ఎంచుకోవాలో అనేది వ్యక్తి సమస్య, లక్షణాలు మరియు వైద్య మూల్యాంకనం ఆధారంగా నిర్ణయించబడుతుంది.శరీరంలోని ప్రధాన ప్రాంతాలు:తల మరియు ముఖం – తలనొప్పి, మైగ్రేన్, సైనస్ సమస్యల కోసం ఉపయోగించే కొన్ని పాయింట్లు..మెడ – మెడ నొప్పి, కండరాల బిగుతు కోసం.భుజాలు – భుజం నొప్పి, ఫ్రోజన్ షోల్డర్ కోసం.చేతులు మరియు మణికట్టు – చేతి నొప్పి, కొన్ని తలనొప్పులలో కూడా ఉపయోగించే పాయింట్లు. వీపు – నడుము నొప్పి, వెన్ను కండరాల బిగుతు కోసం.ఉదరం – కొన్ని జీర్ణకోశ సమస్యల కోసం ఉపయోగించే పాయింట్లు.కాళ్లు మరియు మోకాళ్లు – మోకాలి నొప్పి, సయాటికా, కండరాల నొప్పుల కోసం.పాదాలు – కొన్ని నొప్పులు మరియు ఇతర లక్షణాల కోసం ఉపయోగించే పాయింట్లు.ముఖ్య గమనిక,,ఆక్యుపంక్చర్ పాయింట్ల ఖచ్చితమైన స్థానం తెలుసుకోవడానికి ప్రత్యేక శిక్షణ అవసరం.ఇంట్లో స్వయంగా సూదులు గుచ్చుకోవడం సురక్షితం కాదు. తప్పు పాయింట్లు లేదా తప్పు పద్ధతి వల్ల గాయాలు, రక్తస్రావం లేదా ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఉంది.చికిత్సను అర్హత కలిగిన ఆక్యుపంక్చర్ నిపుణుడు మాత్రమే చేయాలి.

## గిట్టుబాటు ధర కోసం రోడ్డెక్కిన పొగాకు రైతులు..

### జాతీయ రహదారిపై రాస్తారోకో...



**ఏపీ బ్యూరో / జులై 06, ప్రజా ప్రేరణ :**


గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో ఆగ్రహించిన పొగాకు రైతులు సోమవారం రోడ్డెక్కారు. వేలానికి తీసుకొచ్చిన పొగాకు బేళ్లను కొనుగోలు చేయకపోవడంపై నిరసన వ్యక్తం చేస్తూ ఒంగోలు--కర్నూలు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో కొంతసేపు జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.వివరాల్లోకి వెళితే, రైతులు సుమారు 400కు పైగా పొగాకు బేళ్లను వేలానికి తీసుకురాగా, అందులో కేవలం 20 బేళ్లను మాత్రమే కొనుగోలు చేశారు. మిగిలిన బేళ్లకు సరైన ధర లభించకపోవడంతో రైతులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. ఈ నేపథ్యంలో వేలం ప్రక్రియను నిలిపివేసి బయటకు వచ్చిన రైతులు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ జాతీయ రహదారిపై బైఠాయించారు. పొగాకు సాగు కోసం భారీగా పెట్టుబడులు పెట్టామని, కానీ మార్కెట్‌లో సరైన ధరలు లభించక తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంట ఉత్పత్తి వ్యయాలు పెరిగిపోయినా, కొనుగోలు ప్రక్రియలో రైతులకు న్యాయం జరగడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.సమాచారం అందుకున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ పోలీసు సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. రైతులతో చర్చించి పరిస్థితిని వివరించడంతో వారు రాస్తారోకోను విరమించారు. అనంతరం జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.రోడ్డుపై రైతులు చేపట్టిన నిరసనతో కొంతసేపు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడగా, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## కాల్ మనీ మాఫియా మళ్లీ విజృంభిస్తోందంటూ..

### సీఎం చంద్రబాబుకు కేశినేని నాని బహిరంగ లేఖ...

**ఏపీ బ్యూరో / జులై 06, ప్రజా ప్రేరణ :**

విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో కాల్ మనీ మాఫియా మళ్లీ, విజృంభిస్తోందని ఆరోపిస్తూ మాజీ ఎంపీ కేశినేని నాని ముఖ్యమంత్రి చంద్రబాబుకు బహిరంగ లేఖ రాశారు. ఈ వ్యవహారంలో విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ఆయన అనుచరుడిగా పేర్కొన్న ముల్పూరి కిశోర్ పాత్రపై విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.బహిరంగ లేఖలో కేశినేని నాని పలు ఆరోపణలు చేశారు. విజయవాడకు చెందిన మహిళా వ్యాపారవేత్త చాగర్ల గాయత్రీ రూ.5 కోట్ల రుణం తీసుకుని, అసలు, వడ్డీ కలిపి మొత్తం రూ.21 కోట్లు చెల్లించినప్పటికీ, ఆమెపై ఇంకా ఒత్తిళ్లు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఆమెను బెదిరిస్తున్నారంటూ ఆరోపించారు.బాపులపాడు మండలంలో ఉన్న ఆమెకు చెందిన 11 ఎకరాల భూమిని నకిలీ పత్రాల ఆధారంగా ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇందుకోసం అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నారంటూ లేఖలో ఆరోపించారు. బాధితురాలి ఇంట్లోకి చొరబడి దౌర్జన్యానికి పాల్పడిన వారిపై మాచవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనప్పటికీ, ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు.అలాగే, కొందరు పోలీసు విభాగాలను దుర్వినియోగం చేస్తూ అమాయక ప్రజలను వేధిస్తున్నారని కూడా కేశినేని నాని ఆరోపించారు. వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతున్నారని పేర్కొన్న ముల్పూరి కిశోర్‌పై నిరోధక నిర్బంధ చట్టం కింద చర్యలు తీసుకోవాలని




డిమాండ్ చేశారు.2015లో వెలుగులోకి వచ్చిన కాల్ మనీ వ్యవహారాల మాదిరిగానే ప్రస్తుత ఆరోపణలపై కూడా సమగ్ర దర్యాప్తు జరిపించాలని ముఖ్యమంత్రిని కోరారు. బాధితురాలి కుటుంబానికి, వారి ఆస్తులకు పోలీసు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.విజయవాడ ప్రజల ప్రాణాలు, ఆస్తులకు భద్రత కల్పించే వరకు తాను సామాన్య ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తానని కేశినేని నాని తన బహిరంగ లేఖలో పేర్కొన్నారు.అయితే, కేశినేని నాని చేసిన ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తులు, అధికారులు అధికారికంగా స్పందించాల్సి ఉంది.

## డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు..



**ఏపీ బ్యూరో / జులై 06, ప్రజా ప్రేరణ :**

మార్కాపురం జిల్లా,ఎర్రగొండపాలెం మండలంలో డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర వర్క్ చార్జ్ వైస్ ప్రెసిడెంట్ ఆలేటి నాగయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, ఉద్యోగులు పాల్గొని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, అణగారిన వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ చేసిన కృషి దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. సామాజిక సమానత్వం కోసం ఆయన సాగించిన పోరాటం భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. స్వాతంత్ర్యానంతర భారతదేశ నిర్మాణం లో కీలక పాత్ర పోషించిన నాయకుల్లో డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ ఒకరని, వ్యవసాయం, రక్షణ తదితర కీలక రంగాల్లో ఆయన అందించిన సేవలు దేశ ప్రగతికి దోహదపడ్డాయని గుర్తుచేశారు. అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు ఆయన చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ ఆర్ అండ్ బి అధ్యక్షుడు ఎం. సుబ్బయ్య, గుంటి అబ్రహం, కళావత్ రామనాయక్, దళిత నాయకుడు భాస్కర్, ఆలేటి అనిల్, ఉద్యోగులు, నాయకులు పాల్గొని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళులు అర్పించారు.



## సోమశిలలో యథేచ్ఛగా అక్రమ చేపల వేట..



### నిషేధాజ్ఞలు కాగితాలకే పరిమితమా..?

**ఏపీ బ్యూరో / జులై 06, ప్రజా ప్రేరణ :** చేపల సంతానోత్పత్తి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా చేపల వేటపై నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నప్పటికీ, సోమశిల జలాశయంలో మాత్రం అక్రమ చేపల వేట యథేచ్ఛగా కొనసాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధాన ద్వారం గుండా అక్రమ వేటగాళ్లు నిర్భయంగా జలాశయంలోకి ప్రవేశించి చేపల వేట సాగిస్తున్నా, సంబంధిత శాఖల పర్యవేక్షణ కనిపించడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ నిబంధనలను గౌరవిస్తూ స్థానిక మత్స్యకారులు వేటకు దూరంగా ఉంటున్నప్పటికీ, కొందరు అక్రమ వేటగాళ్లు మాత్రం పరిస్థితిని అనుకూలంగా మార్చుకుని మత్స్య సంపదను దోచుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.జలాశయంలో చేపల వేటపై నిషేధం అమల్లో ఉన్న సమయంలోనే పెద్దఎత్తున అక్రమ వేట కొనసాగడం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు.చేపల గుడ్ల సీజన్‌లో విచక్షణారహితంగా చేపలను పట్టడం వల్ల భవిష్యత్తులో మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని మత్స్యకారులు హెచ్చరిస్తున్నారు. నిబంధనలు పాటించే మత్స్యకారులపైనే పరిమితులు అమలు చేస్తూ, అక్రమ వేటగాళ్లను నిరోధించడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.సోమశిల జలాశయం ప్రధాన ద్వారం గుండా అక్రమ వేటగాళ్లు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ, వారిని గుర్తించి అడ్డుకునే చర్యలు కనిపించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మత్స్యశాఖ, పోలీసు శాఖల మధ్య సమన్వయం లోపించిందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ వేట వెనుక ఎవరైనా ప్రభావశీలుల అండ ఉందా అనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సోమశిల జలాశయంలో ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేయాలని, అక్రమ వేటకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.మత్స్య సంపద పరిరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న నిషేధాజ్ఞలను కచ్చితంగా అమలు చేయాలని కోరుతున్నారు. లేదంటే ప్రభుత్వ నిబంధనల అమలుపై ప్రజల్లో అనుమానాలు మరింత పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

## రాత్రిపూట మహిళలను రైలు నుంచి దించరాదు..


### ప్రతి మహిళ తెలుసుకోవాల్సిన రైల్వే నిబంధన..



**ఏపీ బ్యూరో / జులై 06, ప్రజా ప్రేరణ :**

భారతీయ రైల్వేలో మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అమలులో ఉన్న కీలక నిబంధనలపై మరోసారి చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఒంటరిగా ప్రయాణిస్తున్న మహిళలు, చిన్నారులతో కలిసి ప్రయాణిస్తున్న మహిళల భద్రతను దృష్టిలో ఉంచుకుని రైల్వే చట్టంలో ప్రత్యేక రక్షణ చర్యలు పొందుపరిచినట్లు నిపుణులు చెబుతున్నారు.భారతీయ రైల్వే చట్టంలోని సెక్షన్ 139 ప్రకారం, ఒంటరిగా ప్రయాణిస్తున్న మహిళ లేదా పురుష సహచరుడు లేకుండా ప్రయాణిస్తున్న చిన్నారిని రాత్రి సమయంలో రైలు నుంచి దింపేందుకు అనుమతి లేదని పేర్కొన్నట్లు సమాచారం. టిక్కెట్ లేకపోవడం లేదా అదనపు చార్జీలు చెల్లించలేకపోవడం వంటి పరిస్థితుల్లో కూడా మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఈ నిబంధన ఉద్దేశంగా ఉన్నట్లు తెలుస్తోంది.రాత్రి వేళల్లో తెలియని ప్రాంతాల్లో లేదా చిన్న రైల్వే స్టేషన్ల వద్ద మహిళలను దించడం వల్ల భద్రతాపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ఈ నిబంధన అమలులోకి తీసుకొచ్చినట్లు రైల్వే వర్గాలు పేర్కొంటున్నాయి. టిక్కెట్ తనిఖీ సమయంలో మహిళ వద్ద చెల్లుబాటు అయ్యే టిక్కెట్ లేకపోతే, నిబంధనల ప్రకారం జరిమానా విధించే అధికారం టిక్కెట్ పరిశీలకులకు ఉన్నప్పటికీ, రాత్రి సమయంలో బలవంతంగా దించకూడదని చట్టం స్పష్టం చేస్తున్నట్లు సమాచారం.అత్యవసర పరిస్థితుల్లో మహిళను రైలు నుంచి దింపాల్సిన అవసరం ఏర్పడితే, అది పగటి సమయంలో మాత్రమే, ప్రధాన జంక్షన్ లేదా జిల్లా కేంద్ర స్థాయి రైల్వే స్టేషన్‌లోనే జరగాలని, అలాగే మహిళా భద్రతా సిబ్బంది సమక్షంలోనే చర్యలు తీసుకోవాలని నిబంధనలు సూచిస్తున్నాయి.

# విశాఖను మందుబాబుల అడ్డాగా మార్చే కుట్రను అడ్డుకుంటాం..



ఆర్కే బీచ్‌లో మిన్నంటిన బీచ్ షాక్స్ వ్యతిరేక నిరసనలు..

జీవో నంబర్ 362ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్..

మహిళల భద్రతతో చెలగాటమాడితే సహించేది లేదని హెచ్చరిక..

**ఏపీ బ్యూరో / జులై 06, ప్రజా ప్రేరణ :**

గోవా తరహా మద్యం సంస్కృతిని ఆంధ్రప్రదేశ్‌లోకి తీసుకువచ్చి, విశాఖపట్నం వంటి సుందర నగరాన్ని మందుబాబుల అడ్డాగా మార్చేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఆదివారం ఆర్కే బీచ్‌లో నిరసన జ్వాలలు మిన్నంటాయి. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమంలో మహిళలు, యువత, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు.నల్ల బెలూన్లు, నల్ల రిబ్బన్లు ధరించి ఆర్కే బీచ్ వద్ద ఆందోళనకు దిగిన నిరసనకారులు, బీచ్ షాక్స్ ఏర్పాటుకు అనుమతిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 362ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.పర్యాటక అభివృద్ధి పేరుతో విశాఖ సముద్రతీర ప్రాంతాలను మద్యం విక్రయ కేంద్రాలుగా మార్చే కుట్రను ప్రజలు ఎప్పటికీ అంగీకరించబోరని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా మహిళా నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇప్పటికే అనేక సమస్యలు ప్రజలను వేధిస్తున్నప్పటికీ, వాటి పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, మహిళల భద్రతతో చెలగాటమాడే నిర్ణయాలను తీసుకోవడం దురదృష్టకరమని విమర్శించారు. ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా పేరుగాంచిన విశాఖపట్నం తీరాన్ని మద్యం సంస్కృతికి కేంద్రంగా మార్చే ప్రయత్నాలు రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీస్తాయని అన్నారు.కుటుంబాలతో కలిసి సందర్శించే ఆర్కే బీచ్, రుషికొండ, భీమిలి వంటి పర్యాటక ప్రాంతాల్లో బీచ్ షాక్స్ పేరుతో మద్యం విక్రయాలకు అనుమతులు ఇవ్వడం వల్ల మహిళలు, యువతులు, చిన్నారుల భద్రత ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యాటక అభివృద్ధి అంటే మద్యం విక్రయాలను ప్రోత్సహించడం కాదని, మౌలిక వసతులు కల్పించడం, భద్రతా ప్రమాణాలు పెంచడం, స్థానిక సంస్కృతిని పరిరక్షించడం అని ప్రభుత్వానికి గుర్తుచేశారు.విశాఖ ప్రజల మనోభావాలను పూర్తిగా పక్కనపెట్టి, కార్పొరేట్ ప్రయోజనాల కోసం బీచ్ ప్రాంతాలను వ్యాపార కేంద్రాలుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 362 ప్రజా వ్యతిరేకమైనదని, మహిళా వ్యతిరేకమైనదని, సామాజిక విలువలకు విరుద్ధమైనదని మండిపడ్డారు.విశాఖ నగరానికి ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టిన సహజ సౌందర్యాన్ని, ప్రశాంత వాతావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, వాటిని మద్యం వ్యాపార ప్రయోజనాలకు బలిచేయడాన్ని ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోరని హెచ్చరించారు. మహిళల భద్రతను పణంగా పెట్టే నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా బీచ్ షాక్స్ ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకు వెళితే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకులు హెచ్చరించారు. విశాఖ సముద్ర తీరాలను కాపాడుకునేందుకు ప్రజలంతా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

# వెలుగొండ నిర్వాసితుల ఆందోళనతో కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత..

ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని భారీ ఎత్తున నినాదాలు..

పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట..

కొందరికి అనుమతితో సద్దుమణిగిన పరిస్థితి..



**ఏపీ బ్యూరో / జులై 06, ప్రజా ప్రేరణ :**

వెలుగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాలకు చెందిన యువత, నిర్వాసితులు సోమవారం మార్కాపురం కలెక్టరేట్ వద్ద భారీ ఎత్తున ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తమకు పునరావాస, పునరుద్ధరణ ప్యాకేజీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.వెలుగొండ ప్రాజెక్టు కారణంగా జీవనాధారాలు కోల్పోయిన ముంపు గ్రామాల ప్రజలకు న్యాయం చేయాలని, ప్రభుత్వం ప్రకటించిన పునరావాస పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వాసిత యువత కలెక్టరేట్‌కు చేరుకున్నారు. తమ సమస్యలను నేరుగా జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు కలెక్టరేట్ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు.అయితే, భారీ సంఖ్యలో నిర్వాసితులు ఒకేసారి కార్యాలయంలోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా నిర్వాసితులు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. తమ సమస్యలు ఎన్నిసార్లు విన్నవించినా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేసిన నిర్వాసితులు, జిల్లా కలెక్టర్ స్వయంగా బయటకు వచ్చి తమ వినతిపత్రాన్ని స్వీకరించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు."మాకు న్యాయం చేయాలి", "ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వెంటనే అమలు చేయాలి", "నిర్వాసితులకు హామీలు కాదు, హక్కులు కావాలి" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.కొంతసేపు కలెక్టరేట్ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగాయి.పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు నిర్వాసిత నాయకులతో చర్చలు జరిపారు. అనంతరం కొందరు ప్రతినిధులను మాత్రమే కలెక్టరేట్ కార్యాలయంలోకి అనుమతించి, వారి ద్వారా వినతిపత్రాన్ని అధికారులకు అందజేయించారు.దీంతో ఉద్రిక్త పరిస్థితులు సద్దుమణిగాయి.ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ, వెలుగొండ ప్రాజెక్టు కోసం తమ భూములు, ఆస్తులు కోల్పోయినా ఇప్పటికీ పూర్తిస్థాయి పునరావాసం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని అమలు చేయాలని, లేకుంటే తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# కేవీఆర్ అక్రమ అరెస్టు ప్రజాస్వామ్యంపై దాడి,, శ్యామల..


**ఏపీ బ్యూరో / జులై 06, ప్రజా ప్రేరణ :**



సీనియర్ జర్నలిస్ట్ కేవీఆర్ అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు అరె.శ్యామల పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం కక్షసాధింపు రాజకీయాల్లో భాగంగానే కేవీఆర్‌ను అక్రమంగా అరెస్టు చేసిందని ఆమె ఆరోపించారు. ఆదివారం కేవీఆర్ కుటుంబ సభ్యులను వారి నివాసంలో పరామర్శించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు.ఈ సందర్భంగా శ్యామల మాట్లాడుతూ, ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వాటిని పక్కనపెట్టి ప్రభుత్వాన్ని ప్రశ్నించే జర్నలిస్టులు, ప్రజా గొంతులను లక్ష్యంగా చేసుకుని అక్రమ అరెస్టులకు పాల్పడటం అత్యంత దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. అర్ధరాత్రి సమయంలో పోలీసులు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను భయ భ్రాంతులకు గురిచేసి, కేవీఆర్‌ను బలవంతంగా తీసుకెళ్లడం ప్రజాస్వామ్య విలువలపై దాడితో సమానమని అన్నారు.ప్రశ్నించే ప్రతి స్వరాన్ని అణిచివేయాలని చూస్తున్న ప్రభుత్వ వైఖరి రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమని శ్యామల పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో విమర్శలను, ప్రశ్నలను అణచివేయడం కాదు, వాటికి సమాధానం చెప్పడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.రాజకీయ కక్షసాధింపు చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, ప్రజల తరపున మాట్లాడే జర్నలిస్టులను వేధించడం మానుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కేవీఆర్‌పై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకుని, ఆయనకు న్యాయం చేయాలని శ్యామల డిమాండ్ చేశారు.

## ఎల్లుండి నుంచి సదరం స్లాట్ బుకింగ్ ప్రారంభం...

దివ్యాంగులకు ఊరట కలిగించేలా కొత్త విధానం...




**ఏపీ బ్యూరో / జులై 06, ప్రజా ప్రేరణ :**

ఆంధ్రప్రదేశ్‌లో దివ్యాంగుల కోసం సదరం సేవల్లో రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్పులు తీసుకొచ్చింది. సదరం ధ్రువపత్రాల జారీకి సంబంధించిన స్లాట్ బుకింగ్ ప్రక్రియను జులై 8 నుంచి ప్రారంభించి, ఆగస్టు చివరి వరకు కొనసాగించాలని నిర్ణయించింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరాలను వెల్లడించారు.కొత్త విధానంలో భాగంగా రాష్ట్రాన్ని ఆరు జోన్లుగా విభజించి, దివ్యాంగులు తమ సొంత జోన్ పరిధిలోనే స్లాట్ బుక్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. దీంతో సదరం ధ్రువపత్రాల కోసం వందల కిలోమీటర్లు ప్రయాణించాల్సిన అవసరం లేకుండా, స్థానిక స్థాయిలోనే వైద్య పరీక్షలు చేయించుకునే వెసులుబాటు కలగనుంది.జులై 13 నుంచి ఎంపిక చేసిన ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైకల్య నిర్ధారణ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. దివ్యాంగులు మీ–సేవ కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాలు లేదా ఏపీ సేవా పోర్టల్ ద్వారా స్లాట్‌లను బుక్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. స్లాట్ బుకింగ్ సమయంలో స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పించడం తప్పనిసరి కాగా, వైకల్య విభాగంపై స్పష్టత లేని సందర్భాల్లో వైద్యుల ధ్రువీకరణ పత్రాన్ని కూడా జత చేయాల్సి ఉంటుందని వెల్లడించారు.సదరం సేవలను మరింత పారదర్శకంగా, ప్రజలకు అందుబాటులో ఉండేలా రూపొందించడమే ఈ మార్పుల ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు. గతంలో స్లాట్‌ల లభ్యత సమస్యలు, ఇతర జిల్లాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు, పరిపాలనా సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో జోనల్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు.సదరం సేవలన్నీ పూర్తిగా ఉచితమని, దళారులు లేదా మధ్యవర్తులను నమ్మి ఎలాంటి నగదు చెల్లించవద్దని ప్రభుత్వం స్పష్టం చేసింది. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, నిర్ణీత గడువులోగా స్లాట్‌లు బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు.6

## ఆర్టీసీ అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి..

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన...



**ఏపీ బ్యూరో / జులై 06, ప్రజా ప్రేరణ :**

మార్కాపురం జిల్లా, కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ అవుట్‌సోర్సింగ్,కాంట్రాక్ట్ కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఆర్టీసీ డిపోలలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని,కాంట్రాక్ట్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా మార్చాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రతి రెండేళ్లకోసారి కాంట్రాక్టర్లు మారుతున్న సమయంలో కార్మికుల వేతనాల విషయంలో తీవ్ర అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిం 0చారు.కార్మికులకు రూ.12 వేలు చెల్లిస్తున్నట్లు రికార్డుల్లో చూపిస్తూ, వాస్తవానికి కేవలం రూ.9 వేలు మాత్రమే అందిస్తున్నారని తెలిపారు. ఈ అన్యాయాలపై ప్రశ్నించిన కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించడం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.ఆర్టీసీ సంస్థలో ఎన్నో సంవత్సరాలుగా సేవలందిస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వారికి కనీస వేతన చట్టం ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల వేతనాలను మధ్యవర్తుల ద్వారా కాకుండా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసే విధానాన్ని అమలు చేయాలని కోరారు.రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు.నిరసన కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, ఆర్టీసీ అవుట్‌సోర్సింగ్ కార్మికులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సుందరయ్య కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి..

ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలని ధర్నా...

**ఏపీ బ్యూరో / జులై 06, ప్రజా ప్రేరణ :**



సుందరయ్య కాలనీలో మౌలిక సదుపాయాలను తక్షణమే కల్పించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కాలనీ వాసులు ఆదివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, వృద్ధులు, యువకులు పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ, సుందరయ్య కాలనీ ఏర్పాటై ఎన్నో సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో తాగునీరు, అంతర్గత రహదారులు, కాలువలు, వీధి దీపాలు వంటి ప్రాథమిక సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు.అదేవిధంగా కాలనీలో ప్రభుత్వ పాఠశాల లేకపోవడంతో చిన్నారులు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు రవాణా సౌకర్యాల లేమితో విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. తమ సమస్యలను ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదని, అందుకే నిరసన చేపట్టాల్సి వచ్చిందని తెలిపారు.

# ప్రజల ఆజ్ఞే బాధ్యత.. అభివృద్ధే లక్ష్యం..

## గ్రామీణాభివృద్ధికి పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతమే ధ్యేయం : నన్నెబోయిన రవికుమార్ యాదవ్..

## ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం..




**ఏపీ బ్యూరో / జులై 06, ప్రజా ప్రేరణ :** ప్రజల ఆజ్ఞను బాధ్యతగా స్వీకరించి, ప్రజాసేవను ధ్యేయంగా, అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని పనిచేస్తున్నానని అర్ధవీడు మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు నన్నెబోయిన రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అర్ధవీడు మండల మాజీ ఎంపీ పీగా సేవలందించిన నన్నెబోయిన రవికుమార్ యాదవ్, ప్రస్తుతం వైఎస్సా ర్‌సీపీ జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. "ప్రజలే మా శక్తి.. అభివృద్ధే మా లక్ష్యం" అనే నినాదంతో గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని అన్నారు. వైఎస్సార్ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తున్నామని, గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అర్ధవీడు మండల ఎంపీపీగా ఉన్న సమయంలో గ్రామాల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని పేర్కొంటూ, పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత పటిష్టం చేయడం ద్వారా గ్రామ స్థాయిలోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడిగా పనిచేయడమే తన లక్ష్యమని రవికుమార్ యాదవ్ తెలిపారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయడం ద్వారా ప్రజా విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ నాయకత్వంలో ప్రజా సంక్షేమం, గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ప్రజల భవిష్యత్తు, గ్రామాల అభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. "ప్రజల కోసమే మా పని.. ప్రజల కోసమే మా నడక" అనే సంకల్పంతో ప్రజాసేవలో కొనసాగుతానని నన్నెబోయిన రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. 21

# ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ కెమెరాల పరిశీలన..

## నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతికత కీలకం : జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు..

## మార్కాపురం బస్టాండ్ పరిసరాల్లో 16 సీసీ కెమెరాల ఏర్పాటు..



**ఏపీ బ్యూరో / జులై 06, ప్రజా ప్రేరణ :** మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు సోమవారం పరిశీలించారు. బస్టాండ్ ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నిఘా వ్యవస్థ పనితీరును ఆయన క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు నేరాల నియంత్రణ, నేరాల ఛేదనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించడం అత్యంత అవసరమని తెలిపారు. మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల్లో మొత్తం 16 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కెమెరాల ద్వారా బస్టాండ్ పరిసరాల్లో జరిగే బ్యాగుల దొంగతనాలు, ద్విచక్ర వాహనాల చోరీలు, మొబైల్ ఫోన్ చోరీలు వంటి నేరాలను వేగంగా గుర్తించి, నిందితులను గుర్తించడంతో పాటు దొంగిలించబడిన వస్తువుల రికవరీలో కూడా కీలకంగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. నేరస్థుల కదలికలను నిరంతరం పర్యవేక్షించడం ద్వారా నేరాల శాతం తగ్గించే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రజల సహకారం లేకుండా సమర్థవంతమైన పోలీసింగ్ సాధ్యం కాదని పేర్కొన్న జిల్లా ఎస్పీ, ప్రజలు తమ ఇళ్లు, వ్యాపార సంస్థలు, కాలనీలు, ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నివారణతో పాటు, నేరాల విచారణ ప్రక్రియ కూడా వేగవంతం అవుతుందని తెలిపారు. నేరాల నియంత్రణ, నేరస్థుల గుర్తింపు, ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరా వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద కదలికలను వెంటనే గుర్తించి స్పందించాలని, సీసీ కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవి నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్కాపురంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకున్న డీఎస్పీ యు. నాగరాజు, సీఐ అల్తాఫ్ హుసేన్, సంబంధిత పోలీసు సిబ్బంది సేవలను జిల్లా ఎస్పీ అభినందించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ జిల్లాలో మరిన్ని ప్రాంతాల్లో నిఘా వ్యవస్థను బలోపేతం చేసే చర్యలు కొనసాగుతాయని ఆయన తెలిపారు.

# ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం..

## 'మీకోసం' కార్యక్రమంలో 47 ఫిర్యాదుల స్వీకరణ..

## బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలని అధికారులకు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశం..



**ఏపీ బ్యూరో / జులై 06, ప్రజా ప్రేరణ :** మార్కాపురం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణతో పాటు ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపడమే లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మీకోసం' కార్యక్రమాన్ని సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను జిల్లా పోలీసు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. 'మీకోసం' కార్యక్రమంలో మొత్తం 47 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ స్వీకరించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడిన ఆయన, వారి సమస్యలను సవివరంగా అడిగి తెలుసుకుని, చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసు వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే 'మీకోసం' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేపట్టి చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రత్యేకంగా వికలాంగులు, వృద్ధులు, మహిళలకు సంబంధించిన ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, సత్వర పరిష్కారం చూపాలని సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అందిన ఫిర్యాదులకు సంబంధించి పలువురు పోలీసు స్టేషన్ అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడిన జిల్లా ఎస్పీ, వెంటనే విచారణ చేపట్టి బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లా పోలీసు కార్యాలయానికి స్వయంగా రాలేని ప్రజలు తమకు సమీపంలోని పోలీసు స్టేషన్, సర్కిల్ కార్యాలయం, సబ్ డివిజన్ కార్యాలయాల్లో కూడా ఫిర్యాదులు అందజేయవచ్చని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భూ వివాదాలు, కుటుంబ కలహాలు, భార్యాభర్తల మధ్య విభేదాలు, అత్తింటి వేధింపులు, మోసాలు, ఉద్యోగాల పేరుతో మోసపూరిత చర్యలు, ఇతర వ్యక్తిగత, సామాజిక సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు పెద్ద సంఖ్యలో అందాయి.

# కేతగుడిపి-తుమ్మలచెరువు రహదారిలో ముండ్ల కంప తొలగించాలి..

## ప్రధాన రహదారికి తారు రోడ్డు వేయాలని కాంగ్రెస్ డిమాండ్..

## ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు : డా. షేక్ మహబూబ్ వలి..

**ఏపీ బ్యూరో / జులై 06, ప్రజా ప్రేరణ :** మార్కాపురం జిల్లా తర్లుపాడు మండలంలోని కేతగుడిపి-తుమ్మలచెరువు ప్రధాన రహదారికి ఇరువైపులా పెరిగిపోయిన ముండ్ల కంపలు, పిచ్చి పొదలను వెంటనే తొలగించాలని, అలాగే ఆ రహదారికి తారు రోడ్డు నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ మైనార్టీ విభాగం చైర్మన్ డా. షేక్ మహబూబ్ వలి ఈ మేరకు ప్రభుత్వ అధికారులను కోరారు. తర్లుపాడు మండల కార్యాలయంలో సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ, కేతగుడిపి, తుమ్మలచెరువు, జగన్నాథపురం గ్రామాలకు చెందిన ప్రజలు మార్కాపురం పట్టణం, జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లేందుకు ఈ రహదారిని ప్రధాన మార్గంగా ఉపయోగిస్తున్నారని తెలిపారు. అయితే రహదారికి ఇరువైపులా ముండ్ల కంపలు, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా కేతగుడిపి గ్రామం నుంచి తుమ్మలచెరువులోని పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ప్రతిరోజూ ఇబ్బందులతో ప్రయాణించాల్సి వస్తోందని పేర్కొన్నారు. రహదారి ఇరుకుగా మారడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు సరిగా కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రానికి అత్యంత సమీపంలో ఉన్న ఈ ప్రాంత ప్రజలు ఇప్పటికీ కనీస మౌలిక సదుపాయాల కోసం ఇబ్బందులు పడటం దురదృష్టకరమని ఆయన అన్నారు. గ్రామ ప్రజలు, విద్యార్థులు తమ సమస్యను దృష్టికి తీసుకురావడంతో తర్లుపాడు మండల కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారికి వినతిపత్రం అందజేసి, వెంటనే జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలని కోరినట్లు తెలిపారు. ఈ సమస్యను సంబంధిత పంచాయతీ అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.





దేశవ్యాప్తంగా గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్న నేపథ్యంలో, జిల్లా కేంద్రానికి అత్యంత సమీపంలో ఉన్న ఈ ప్రధాన రహదారిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని డా. షేక్ మహబూబ్ వలి కోరారు. కేతగుడిపి--తుమ్మలచెరువు ప్రధాన రహదారికి తక్షణమే తారు రోడ్డు నిర్మిస్తే తుమ్మలచెరువు, కేతగుడిపి, జగన్నాథపురం గ్రామాల ప్రజలకు మార్కాపురం పట్టణం, జిల్లా కలెక్టరేట్‌కు రాకపోకలు సులభతరం అవుతాయని తెలిపారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించి, ముండ్ల కంపలను తొలగించడంతో పాటు రహదారి అభివృద్ధి పనులను చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ తరపున ఆయన డిమాండ్ చేశారు.

PRAJA PRERANA ,APTEL/26/A3850,Registration Number TELUGU DAILYKUNDURU SRINIVASA REDDY Publisher 9000449821 D NO 1-145-B, NOORANI MASEED, RTC BUS STATION BACK SIDE, PRAKASAM, ANDHRA Address PRADESH - 523316.D NO 1-145-B, NOORANI MASEED, RTC BUS STATION BACK SIDE, MARKAPUR,Place of Publication PRAKASAM, ANDHRA PRADESH - 523316.MADDINENI NAGESWARA RAOP rinter BUILD-ING NO. 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. Address : SUNDAY PRINTING PRESS Printing Press (Name & Address) DOOR NO 1-94, KONETI BAZAR, PRAKASAM, ANDHRA PRADESH - 523316. KUNDURU SRINIVASA REDDY Owner D NO 1-145-B, NOORANI MASEED, RTC BUS STATION BACK SIDE, PRAKASAM, ANDHRAPRDESH